

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.47

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.47, కనిష్టంగా రూ.30 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
34.6°/21.7°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా మోస్తరు వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

29 మండలాల్లో వర్షం



పుట్టపర్తి అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో వరుసగా మూడో రోజూ జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిశాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ జిల్లాలోని 29 మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా తాడిమర్రి మండలంలో 56.2 మి.మీ, తలుపుల మండలంలో 54.6 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. ఇక ముదిగుబ్బ మండలంలో 48.6 మి.మీ, గాండ్లపెంట 48.2, చిలమత్తూరు 39.6, పరిగి 35.4, కదిరి 31.2, ఎన్పీ కుంట 26.2, తనకల్లు 18.6, నల్లచెరువు 17, గోరంట్ల 15.2, పెనుకొండ 14.4, హిందూపురం 14.2, సోమందేపల్లి 13, అమడగూరు 11.8, మిగతా మండలాల్లో 10 నుంచి 3.2 మి.మీ మధ్య వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలపారు.

సికింద్రాబాద్- మైసూరు మార్గంలో ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: సికింద్రాబాద్–మైసూర్ మార్గంలో ఈ నెల 8 నుంచి 30 వరకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ జంక్షన్ (07033) నుంచి సోమ, శుక్రవారాల్లో రాత్రి 10.10 గంటలకు రైలు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4.00 గంటలకు మైసూర్ జంక్షన్‌కు చేరుకుంటుందన్నారు. మైసూర్ జంక్షన్ (07034) నుంచి మంగళ, శనివారాల్లో సాయంత్రం 5.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ చేరుతుందన్నారు. బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, యాదగిరి, కృష్ణ, రాయచూర్, మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, హిందూపురం, యలహంక, బెంగుళూరు కంటోన్మెంట్, బెంగుళూరు జంక్షన్, కెనిగేరి, మండ్య మీదుగా రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు. 2టైర్, 3టైర్, స్లీపర్, జనరల్ బోగీలు ఉంటాయన్నారు.

జీతాలు చెల్లించండి మహాప్రభో



పంప్‌హౌస్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

పుట్టపర్తి టౌన్: నాలుగు నెలల వేతన బకాయిలు చెల్లించాలంటూ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కొత్తచెరువులోని సత్యసాయి పంప్ హౌస్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జిల్లాలోని వెయ్యి గ్రామాల్లోని 10 లక్షల మంది ప్రజలకు సత్యసాయి తాగునీటి పథకం ద్వారా 540 మంది కార్మికులు నీటిని సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో పైప్‌లైన్ దెబ్బతిన్న ప్రతిసారీ సొంత డబ్బు వెచ్చించి మరమ్మతులు చేశామన్నారు. అయినా తమకు వేతనాలు అందజేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించాడంటూ వాపోయారు. ఫలితంగా కుటుంబ పోషణ, పిల్లల చదువులు భారమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 14 రోజుల క్రితం సమ్మె నోటీసు ఇచ్చినా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే నిధులు విడుదల చేసి 4 నెలల వేతన బకాయిలు చెల్లించాలని, పథకం నిర్వహణకు పూర్తి బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వమే కేటాయించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు.

అంతు చిక్కని బ్యాంకు దోపిడీ..



హిందూపురం తూముకుంట ఎస్‌బీఐలో పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

జిల్లాలో అతి పెద్ద పట్టణమైన హిందూపురంలో ఇటీవల వెలుగు చూసిన బ్యాంకు దోపిడీ ఇప్పటికీ అంతు చిక్కడం లేదు. జాగిలాలతో గాలించినా ఫలితం లేదు. సీసీటీవీ పుటేజీలతోనూ సాధ్యం కాలేదు. దొంగల కోసం పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ కేసును ఛేదించేందుకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి ప్రత్యేక బలగాలు రంగంలోకి దిగినట్లు పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. అయినా ఇంత వరకూ చెప్పుకోదగ్గ ఫలితం కనిపించలేదు.

కదిరిలో మహిళల మెడలోని చైన్‌లే టార్గెట్..



కదిరిలో సంచరిస్తున్న దొంగలు (సీసీ ఫుటేజీ)

ఇటీవల కదిరిలో జరిగిన చైన్ స్నాచింగ్‌లతో ఆ ప్రాంత మహిళలు బంగారు ఆభరణాలు ధరించి బయటకు రావాలంటే భయపడిపోతున్నారు. ఆభరణాలతో బయటికి వస్తే.. ఇంటికి చేరే లోపు దారికాచి దోపిడీ దొంగలు బీభత్సం చేస్తున్నారు. కత్తులతో బెదిరించి మహిళల మెడల్లో బంగారు గొలుసులు లాక్కెళ్తున్నారు. పోలీసులకు పట్టించినా.. ఫలితం లేకపోగా.. తిరిగి బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్నారు. కొన్ని కేసుల్లో సీసీటీవీ పుటేజీలు లభించినా దొంగలను పట్టుకోలేకపోవడం గమనార్హం.

దొంగా.. దొంగా

ప్రతిచోటా సీసీ కెమెరా... డ్రోన్ కెమెరాలు.. రాత్రిపూట గస్తీలు..పల్లె నిద్రలు.. ఇవేవీ చోరీలను ఆపలేకపోతున్నాయి. పోలీసులు హడావుడి చేస్తుండగా.. దొంగలు మాత్రం సైలెంట్‌గా పనికానిచ్చేస్తున్నారు. రోజుకో చోట చేతివాటం చూపుతూ పోలీసులకే సవాల్ విసురుతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల కాలంలో చోటుచేసుకున్న చోరీలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.



- జిల్లాలో రెచ్చిపోతున్న దొంగలు
- రోజూ ఏదోచోట చోరీల కలకలం
- బైకులు, బ్యాంకులు, ఇళ్లు, బంగారం టార్గెట్
- పోలీసులకు సవాల్ విసురుతున్న చోరులు
- చేష్టలుడిగి చూస్తున్న పోలీసులు

సాక్షి, పుట్టపర్తి

జిల్లాలోనూ దొంగలు చెలరేగిపోతున్నారు. రోజుకో చోట కొత్త పంథాలో చోరీలు చేస్తూ పోలీసులకే సవాల్ విసురుతున్నారు. చోరీలను కట్టడి చేయడంలో విఫలమవుతున్న పోలీసులు... చోరీ జరిగాక కూడా దొంగలు ఎవరన్నది కనుక్కోలేకపోతున్నారు. సొమ్ము రికవరీ కూడా లేకపోవడంతో బాధితులు సర్వం కోల్పోయి గగ్గోలు పెడుతున్నారు. గట్టిగా ప్రశ్నిస్తే ''దొంగలు దొరకడం లేదు.. ఏం చేయాలి'' అని పోలీసులు చెబుతుండగా.. ప్రజలు ఇక దేవుడి పైనే భారం అనుకుంటున్నారు.

భిన్న కోణాల్లో చోరీలు..

జిల్లాలో ఒక్కో చోట ఒక్కోరకంగా చోరీ జరుగుతోంది. దొంగలు ఇళ్లు, బ్యాంకులు, బస్సుల్లో స్మార్ట్ ఫోన్లు, బైకులు, రోడ్డుపై మహిళల మెడల్లో గొలుసులు, బయట ఉండే పాడి పశువులు.. ఇలా ఏదీ వదలడం లేదు. అసలు ఎవరు చోరీ చేశారో కూడా పోలీసులు కనుక్కోలేకపోతున్నారు. పదే పదే దొంగతనాలు జరుగుతున్నా నిఘా ఎందుకు పటిష్టం చేయలేకపోతున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

జాగిలాలకూ జాడ చిక్కడం లేదు..

జిల్లాలో జరిగిన చోరీలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించి జాగిలాలను రంగంలోకి దించినా... అవి కూడా దొంగల జాడ కనుక్కోలేకపోతున్నాయి. చిన్న చిన్న దొంగలు మినహా ముఖ్యమైన చోరీలను ఛేదించిన దాఖలాలు లేవు. ఒక వేళ ఒకటి, రెండు కేసులను ఛేదించినా చోరీ అయిన సొమ్ములో కనీసం 20 శాతం కూడా రికవరీ ఉండటం లేదు. దీంతో పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లింది.

కేసు కట్టకుండా ఉచిత సలహా..

బైక్, మొబైల్స్ చోరీకి గురైందని ఎవరైనా పోలీసు స్టేషన్‌కు వెళితే.. పోలీసులు కేసులు కట్టడం లేదు. పైగా ''జాగ్రత్తగా ఉండాలి కదా'' అంటూ ఉచిత సలహా ఇస్తున్నారు. మెడలో గొలుసులు లాక్కెళ్లారని చెబితే.. బంగారు ఆభరణాలు ధరించి ఒంటరిగా బయట తిరగరాదని చెబుతున్నారు. ఇంట్లో దొంగలు పడ్డారని ఫిర్యాదు చేస్తే.. తాళం వేసుకుని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సమాధానం చెబుతున్నారు. దీంతో చోరీలకు గురైన బాధితులకు న్యాయం జరగడం లేదు.

ధర్మవరంలో బైక్ దొంగల బీభత్సం..

సిల్క్ సిటీ ధర్మవరంలో బైక్ దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. ఇంటి బయట బైక్ ఉంచితే.. తెల్లవారేసరికి మాయం అవుతోంది. చోరీకి గురైన వాహనాలు కళ్లెదుటే మరొకరి చేతిలో కనిపిస్తున్నా.. పట్టుకోలేని స్థితి. దొంగలు ఇదే దారిలో ఇప్పుడే తమ బైక్‌తో కనిపించారని చెప్పినా.. పోలీసులు స్పందించడం లేదని బాధితులు వాపోతున్నారు. ఇలాంటి అరుదైన ఘటనలు వెలుగు చూడటం దారుణం.



పుట్టపర్తిలో దోపిడీ దృశ్యం (సీసీ ఫుటేజీ)

కలకలం రేపుతున్న చోరీలు..

పుట్టపర్తిలో వరుస చోరీలు కలకలం రేపాయి. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ క్వార్టర్స్‌లో ఏకకాలంలో 9 ఇళ్లలో జరిగిన చోరీలు స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది. అంతకుముందు కర్ణాటక నాగేపల్లిలో ఉన్న విల్లాస్‌లో ఓ ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో బంగారు, నగలు ఎత్తుకెళ్లారు. జనరల్ ఆస్పత్రి, గణేశ్ సర్కిల్, ప్రశాంతి గ్రామ్‌లలో పలు దఫాలుగా ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. ఇంత వరకూ ఈ కేసులేవీ తేలలేదు.

బ్యాంకు దోపిడీ కేసు ఏమైంది?

- హిందూపురం డీఎస్పీని ప్రశ్నించిన డీఐజీ షిమోషీ
- హిందూపురం డివిజన్‌లో నమోదైన కేసులపై సమీక్ష



వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్ద డీఐజీ షిమోషీ, డీఎస్పీ మహేష్ తదితరులు

హిందూపురం: తూమకుంట పారిశ్రామికవాడలోని ఎస్‌బీఐ దోపిడీ కేసు ఏమైందని అనంతపురం రేంజ్ డీఐజీ హిందూపురం డీఎస్పీ మహేష్‌ను ప్రశ్నించారు. కేసులో ఏ చిన్న క్లూను కూడా వదలకుండా దర్యాప్తు చేపట్టాలని, వీలైనంత త్వరగా దొంగలను పట్టుకోవాలని ఆమె ఆదేశించారు. బుధవారం డీఐజీ షిమోషీ వన్‌టౌన్ పోలీసుస్టేషన్ గెస్ట్ హౌస్‌లో హిందూపురం డివిజన్ పరిధిలో నమోదైన వివిధ కేసులపై డీఎస్పీతో సమీక్షించారు.

చిలమత్తూరు పరిధిలో ఎనిమిదేళ్ల చిన్నారిపై అఘాయిత్యం, ఆపై హత్య ఘటన కేసు, టేకులోడులో ఫ్యాక్టరీ వద్ద జరిగిన గ్యాంగ్ రేప్ కేసుపై చర్చించారు. డివిజన్ పరిధిలోని పాతనేరస్తుల గురించి ఆరా తీశారు. పెండింగ్ కేసులు...దర్యాప్తు తీరు తెలుసుకుని పలు సూచనలు చేశారు.

పీస్ కమిటీలతో సమావేశాలు ఏర్పాటు చేయండి..

వినాయక చవితి పండుగ సందర్భంగా పీస్ కమిటీలతో సమావేశాలు ఏర్పాటు చేయాలని డీఐజీ షిమోషీ ఆదేశించారు. వినాయక విగ్రహాల ప్రతిష్ట, ప్రతిమల ఎత్తు.. బందోబస్తు తదితర అంశాలపై డీఎస్పీతో ఆమె ఆరా తీశారు. నెలాఖరులోపు తిరిగి మరోసారి వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సమావేశం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. అనంతరం డీఎస్పీ మహేష్ విలేకరులతో మాట్లాడారు. బ్యాంకు దోపిడి కేసు గురించి విలేకరులు ప్రశ్నించగా... ''కొన్ని జటిలమైన కేసులుంటాయి... కొంత సమయం పడుతుంది'' అని సమాధానం చెప్పారు. మరో రెండు మూడు రోజుల్లో పూర్తి వివరాలు చెబుతామన్నారు.

కందిపప్పూ కరువే!



మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ధరలను నియంత్రించడంతో పాటు చౌకధాన్యపు దుకాణాల ద్వారా నిరుపేదలకు రేషన్ సరుకులు అందించాల్సి ఉంది. కానీ కూటమి సర్కార్‌కు ప్రచారం తప్ప... పేదల ఆకలి కేకలు పట్టడం లేదు. రేషన్ సరుకుల్లో ఇవ్వాల్సిన కందిపప్పుకు మంగళం పాడింది. ఫలితంగా నిరుపేదలు పప్పుచారుకూ నోచుకోలేకపోతున్నారు.

- పేదింట ఉడకని పప్పు
- రేషన్ సరుకుల్లో ఇవ్వని కూటమి సర్కార్
- బియ్యం, పంచదారకే పరిమితం
- మార్కెట్‌లో పెరిగిన కంది పప్పు ధర
- పప్పుచారుకూ నోచుకోలేని స్థితిలో నిరుపేదలు

ప్రశాంతి నిలయం: రాష్ట్రంలో కూటమి సర్కార్ కొలువుదీరాక పౌరసరఫరాల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. ఏడాదిగా నిత్యావసర సరుకులు సరిగా పంపిణీ చేయకుండా నిరుపేదలను వేధిస్తోంది. గతంలో ఇచ్చే కందిపప్పుకు పూర్తిగా మంగళం పాడింది. ఇప్పుడు కేవలం బియ్యం, అరకొరగా చక్కెర అందించి చేతులు దులుపుకుంటోంది.

5.76 లక్షల కుటుంబాలకు కందిపప్పు కట్..

జిల్లాలో 5,76,632 రేషన్ కార్డులుండగా, 1,367 రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు ప్రతి నెలా రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నారు. ప్రతి నెలా 8,600 మెట్రిక్ టన్నుల బియ్యం, 430 మెట్రిక్ టన్నుల చక్కెర, 576 మెట్రిక్ టన్నుల కందిపప్పు కార్డుదారులకు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ప్రతి నెలా బియ్యం మాత్రమే అందిస్తోంది. చక్కెర అరకొరగా ఇస్తూ, కంది పప్పును పూర్తిగా బంద్ చేసింది.



గతంలో ఇంటి వద్దకే వచ్చి వాహనం ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

మార్కెట్‌లో కొనలేక..

కిలో కందిపప్పు మార్కెట్‌లో రూ.120 నుంచి రూ.150 వరకూ ధర పలుకుతోంది. గతంలో రేషన్ దుకాణాల ద్వారా రూ.67లకే కిలో కందిపప్పును ప్రభుత్వం అందించేది. కానీ కూటమి సర్కార్ కంది పప్పు ఇవ్వకపోవడంతో నిరుపేదలు మార్కెట్‌లో అంత ధర వెచ్చించి కందిపప్పు కొనలేకపోతున్నారు. ఈ నెలలో వినాయక చవితి, కృష్ణాష్టమి, వరలక్ష్మి వ్రతం తదితర పండుగలుండగా... కనీసం ఈ నెల అయినా ప్రభుత్వం పూర్తి స్థాయిలో రేషన్ సరుకులు అందిస్తుందని ప్రజలు ఆశించారు. కానీ కూటమి ప్రభుత్వం ఎప్పటిలాగే ఈ నెల కోటాలో కూడా బియ్యం, అరకొర చక్కెరతో సరిపెట్టింది. దీంతో నిరుపేదలు పప్పుకోసం అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకులు అందించే వారు. క్రమం తప్పకుండా బియ్యం, చక్కెర, కందిపప్పు, గోధుమపిండి పంపిణీ చేసేవారు. ఇళ్ల ముంగిట్లోనే రేషన్ సరుకులు అందుతుండటంతో పేదలు ఎంతో సంతోషించే వారు. కానీ కూటమి ప్రభుత్వం పౌర సరఫరాల పంపిణీని అస్తవ్యస్తం చేసింది. తొలుత ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేసే వాహనాలను తొలగించింది. అంతేకాకుండా రేషన్ సరుకుల్లోనూ కోతలు విధించింది. కందిపప్పు, రాగులు, గోధుమపిండికి పూర్తిగా మంగళం పాడింది. ప్రస్తుతం ప్రతి నెలా బియ్యం మాత్రం అవసరమైన మేరకు పంపిణీ చేస్తోంది. పంచదార కూడా అరకొర మాత్రమే అందిస్తోంది. అధికారం చేపట్టిన నాటి నుంచి ఒక్క నెల కూడా పూర్తిస్థాయిలో రేషన్ సరుకులు పంపిణీ చేయకపోవడంతో కూటమి సర్కార్‌పై నిరుపేదలు శాపనార్థాలు పెడుతున్నారు.

ప్రభుత్వం ఇస్తే పంపిణీ చేస్తాం

ప్రభుత్వం ఆగస్టు నెలకు సంబంధించి బియ్యం, పంచదార మాత్రమే సరఫరా చేసింది. కంది పప్పు ఇంకా ఇవ్వలేదు. ప్రభుత్వం సరఫరా చేస్తే రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు కందిపప్పు అందిస్తాం. – వంశీకృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

బదిలీ టీచర్లకు వేతన వెతలు

- రెండు నెలలుగా జీతాలు అందక అవస్థలు
- పొజిషన్ ఐడీ కేటాయించని విద్యాశాఖ అధికారులు



కదిరి: ఉపాధ్యాయులు రెండు నెలలుగా వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మే, జూన్ మాసాల్లో ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. పదోన్నతులు పొంది బదిలీపై కొత్త పాఠశాలలకు వెళ్లిన ఎంతోమంది ఉపాధ్యాయులకు ఇప్పటికీ వేతనాలు అందలేదు. పదోన్నతి పొందామని ఆనందపడాలో..జీతం రాలేదని బాధపడాలోనని అయోమయంలో ఉన్నారు. ఇంటి అద్దెలు, ఇంటి ఖర్చులతో పాటు పిల్లల ఫీజులు చెల్లించేందుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

సమస్య ఏంటి?

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన వేసవి సెలవుల్లో మే 21న ప్రారంభమైన ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల ప్రక్రియ జూన్15తో ముగిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,152 మంది టీచర్లు బదిలీ అయ్యారు. వీరిలో గ్రేడ్–2 హెచ్ఎంలు 133 మంది, పీఎస్ హెచ్ఎంలు 193 మంది, స్కూల్ అసిస్టెంట్‌లు 3,478 మంది, ఎస్జీటీ టీచర్లు 3,208 మంది, పండిట్లు 111 మంది, పీఈటీలు 29 మంది ఉన్నారు. పదోన్నతితో పాటు బదిలీ అయిన టీచర్లకు విద్యాశాఖ అధికారులు పొజిషన్ ఐడీలు కేటాయించాల్సి ఉంటుంది. వారు ఆ ప్రక్రియ సకాలంలో పూర్తి చేయనందున ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 2,200 మంది టీచర్లకు జూన్, జూలై మాసాలకు సంబంధించిన వేతనాలు ఖాతాల్లో జమ కాలేదు.

కూటమి సర్కారు తెచ్చిన తంటా..

కూటమి ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం నుంచి పలు రకాల పాఠశాలల పేరుతో మార్పులు చేసింది. అప్‌గ్రేడ్ అయిన ప్రైమరీ స్కూళ్లు, కొత్తగా ఏర్పాటైన మోడల్ ప్రైమరీ స్కూళ్లకు బదిలీ అయిన టీచర్లు, పదోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్లు, గ్రేడ్–2 హెచ్ఎంలు... ఇలా సుమారు 2,200 మంది వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారు. వీరందరికీ కొత్తగా పొజిషన్ ఐడీలు కేటాయించాల్సి ఉంది. ఇంత వరకూ కూటమి సర్కారు ఆ పని పూర్తి చేయలేదు. సాధారణంగా వేతనాల బిల్లు ప్రతి నెలా 25వ తేదీలోపు సీఎఫ్ఎంఎస్ ద్వారా అప్‌లోడ్ చేసి, ట్రెజరీకి బిల్లు సమర్పించాలి. ప్రభుత్వం వీరికి సకాలంలో పొజిషన్ ఐడీ కేటాయించనందున సంబంధిత అధికారులు ఈ ప్రక్రియ పూర్తి చేయలేక పోయారు. ఈ కారణంతో వీరికి రెండు నెలలుగా వేతన వెతలు తప్పడం లేదు.

ప్రభుత్వ వైఫల్యమే



వేసవి సెలవులు ముగిసి తిరిగి పాఠశాలలు పునః ప్రారంభించి మూడు నెలలు కావస్తున్నా బదిలీ అయిన కొందరు టీచర్లకు ఇంత వరకూ జీతాలు అందలేదంటే అది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమే. నెల జీతం రాగానే ఇంటి అద్దె, సరుకులు, కరెంటు బిల్లు, పాల బిల్లు, పేపర్ బిల్లు, డిష్ బిల్లు, సెల్‌ఫోన్ల రీచార్జ్‌లు, బ్యాంకు ఈఎంఐలు, పిల్లల ఫీజులు ఇలా ఎన్నో ఖర్చులు ఉంటాయి.

– కాడిశెట్టి శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్

కూటమి సర్కారు విఫలం



ఉపాధ్యాయ సమస్యలను ఇప్పటికే ఎన్నోసార్లు కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఎలాంటి స్పందన లేదు. బదిలీ అయిన టీచర్లు ఎంతో మంది రెండు నెలలుగా జీతాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికీ వారికి పొజిషన్ ఐడీ కేటాయించడంలో కూటమి ప్రభుత్వం విఫలమవుతోంది.

– పీవీ రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌టీఏ

వేతన కష్టాలు తీర్చాలి



ప్రభుత్వానికి టీచర్ల నుంచి ఏదైనా సమాచారం కావాలంటే గంటల వ్యవధిలోనే ఇవ్వాలని చెబుతారు. కానీ టీచర్ల వేతనాల విషయంలో మాత్రం ప్రభుత్వం జూన్ నుంచి ఇప్పటి దాకా చిన్న సమస్యను పరిష్కరించలేక పోతోంది. ప్రభుత్వం వెంటనే వేతన కష్టాలు తీర్చాలి.

– కట్టుబడి గౌస్‌లాజం, జిల్లా అధ్యక్షుడు, డీటీఎఫ్

ఆర్టీఏలో ఏసీబీ గుబులు

- ఇప్పటికే ఓ ఏఎంవీఐ సర్వీస్ నుంచి తొలగింపు
- ఉమ్మడి జిల్లాలోనూ పలువురిపై వేటు తప్పదని ఊహాగానాలు
- వణికిపోతున్న ఏసీబీ కేసులున్న అధికారులు



రవాణా శాఖ కార్యాలయం

అనంతపురం సెంట్రల్: ఏసీబీ కేసుల్లో నిందితులుగా ఉన్న రవాణా శాఖ అధికారుల్లో గుబులు రేగుతోంది. ఇటీవల అనంతపురం రవాణా శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అధికారిని ఉద్యోగం (రిమూవ్ ఫ్రం సర్వీస్) నుంచి తొలగించడం అవినీతి అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఉమ్మడి జిల్లాలోనూ పలువురిపై వేటు తప్పదని ఊహాగానాలు రేగడంతో ఎప్పుడు ఎవరిపై వేటు పడుతుందోననే ఆందోళనలో బిక్కుబిక్కుమంటున్నారు. ఇప్పటికే ఏసీబీ అధికారులకు పట్టుబడిన పలువురు ఉద్యోగులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. వీరంతా ఇప్పుడు ఏసీబీ దెబ్బకు భయపడిపోతున్నారు.

చర్యలకు ఉపక్రమణ..

అవినీతి నిరోధక శాఖ అధికారులకు లంచం తీసుకుంటూ పట్టుబడిన, ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన అధికారులపై రవాణా శాఖ ఉన్నతాధికారులు ఇటీవల చర్యలకు ఉపక్రమించారు. ఈ విషయంలో రవాణా శాఖ కమిషనర్ సీరియస్‌గా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఇటీవల జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ఓ ఏఎంవీఐని ఏకంగా సర్వీసు నుంచి తొలగించారు. గతంలో ఏసీబీకి పట్టుబడిన ఓ అధికారి ఇటీవల కర్నూలు జిల్లా నుంచి ఇక్కడికి రాగా పవర్స్ ఇవ్వకుండా ఉంచారు. ఆరు నెలలు దాటినా తిరిగి అధికారాలు పునరుద్ధరించకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 25 మందికిపైగా ఉన్నట్లు సమాచారం. గతంలో జిల్లా కేంద్రంలో ఇద్దరు ఎంవీఐలు, ఓ ఏఎంవీఐ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలో కూడా ఇద్దరు ఎంవీఐలు, ఓ చిన్న స్థాయి సిబ్బంది ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం వీరందరి గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నట్లు సమాచారం.

హోంగార్డుల్లో కంగారు..

రవాణా శాఖలో డిప్యూటేషన్‌పై పనిచేసే పోలీసు శాఖకు చెందిన హోంగార్డులు కూడా అనేక సందర్భాల్లో ఏసీబీకి పట్టుబడ్డారు. దీంతో ఒకరిద్దిని ఇప్పటికే ఉద్యోగం నుంచి తొలగిస్తూ (రిమూవ్ ఫ్రం సర్వీస్) నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే కొంతమంది కోర్టును ఆశ్రయించారు. పై అధికారులు చెబితేనే తాము చేశాం.. చిరుద్యోగులం.. తమపై ఏసీబీ కేసులు తొలగించాలంటూ న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఈ అంశంపై కూడా త్వరలో ఉత్తర్వులు వచ్చే అవకాశముందని అధికార వర్గాల ద్వారా తెలిసింది.

వీఆర్ఎస్‌కు..

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు ఉన్నతాధికారుల చర్యల నుంచి బయటపడేందుకు కొంతమంది స్వచ్ఛంద పదవీ విరమణ (వలంటరీ రిటైర్మెంట్) చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. అయితే పదవీ విరమణ అయినప్పటికీ ఏసీబీ కేసుల్లో ఉన్న అధికారులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ రావని తెలియడంతో మిన్నకుండిపోతున్నారు. ఏదీ ఏమైనా రవాణాశాఖ అధికారులకు ఏసీబీ భయం కంటి మీద కునుకులేకుండా చేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

ప్రీ పీహెచ్‌డీ పరీక్షకు హాజరైన మాజీ మంత్రి



ప్రీ పీహెచ్‌డీ పరీక్ష రాస్తున్న ఉషశ్రీచరణ్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. బుధవారం నిర్వహించిన పరీక్షకు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు కేవీ ఉషశ్రీ చరణ్ హాజరయ్యారు. ప్రొఫెసర్ కె.రాంగోపాల్ పర్యవేక్షణలో ఫిజిక్స్‌లో ఆమె పీహెచ్‌డీ చేస్తున్న విషయం తెలిసిందే.

నవోదయ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయలో 2026–27 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్టు లేపాక్షిలోని నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2025–26 విద్యాసంవత్సరంలో గుర్తింపు పొందిన పాఠశాలల్లో 8, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు సెప్టెంబర్ 23వ తేదీలోపు www. navodaya. gov. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. 2026, ఫిబ్రవరి 7న ప్రవేశ పరీక్ష నిర్వహించి, అర్హులను ఎంపిక చేస్తారు. అలాగే ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 13వ తేదీ వరకూ గడువు పొడిగించారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి



రమేష్ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు పీఎస్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ రమేష్ (45) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కొంత కాలంగా సెలవు పెట్టి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం పరిస్థితి విషమించడంతో మడకశిరలోని తన స్వగృహంలో ఆయన మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలియగానే కంబదూరు పీఎస్ సిబ్బంది ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అయ్యవార్ల యాప్‌సోపాలు

విద్యార్థులకు చదువు చెప్పడం కన్నా, పాలనాపరమైన బాధ్యతలు, బోధనేతర విధుల భారంతో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. యాప్స్, బోధనేతర కార్యక్రమాల పేరుతో టీచర్లను కట్టుబానిసల్లా ప్రభుత్వం మార్చేసిందని జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ యాప్‌ల భారం నుంచి ఉపాధ్యాయులను మినహాయించి వారిని విద్యాబోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

- ప్రభుత్వ తీరుతో బోధనకు దూరమవుతున్న ఉపాధ్యాయులు
- యాప్ భారంతో కొండెక్కిన విద్యార్థుల చదువు
- పీ–4 దత్తత తీసుకోవాలంటూ తీవ్ర ఒత్తిడి



కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఫ్యాప్టో ఆధ్వర్యంలో పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

పుట్టపర్తి: ఉపాధ్యాయులకు బోధనేతర పనులు కేటాయించబోమని, వారిని బోధనకు మాత్రమే పరిమితం చేస్తామంటూ ఎన్నికల సమయంలో స్పష్టమైన హామీనిచ్చిన కూటమి పెద్దలు... అధికారం చేపట్టిన తర్వాత ఆ హామీని తుంగలో తొక్కారు. విద్యార్థులకు నాణ్యమైన ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా ఇచ్చిన హామీ బుట్టదాఖలైంది. యాప్‌ల పేరుతో బోధనేతర పనులను కేటాయించడంతో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల్లో అసహనం రేకెత్తుతోంది.

పైకి ఒక్కటే.. తెరిస్తే 36!

కూటమి ప్రభుత్వం ఏర్పడితే తమకు ఏదో మేలు జరుగుతుదనే ధోరణి గతంలో ఉపాధ్యాయ, ఉద్యోగుల్లో వ్యక్తమైంది. అయితే ఇందుకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పని భారంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా యాప్‌ల భారం, శిక్షణా తరగతులతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. పాఠశాల ప్రారంభమైన నుంచి ముగిసే వరకూ యాప్‌లతో ఉపాధ్యాయులు కుస్తీ పడుతున్నారు. మొత్తం 36 రకాల అంశాలకు సమాధానం ఇవ్వాల్సి వస్తోందని చెబుతున్నారు. ఉదయం పాఠశాలకు రాగానే విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు నుంచి మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల కిట్లు, హాజరు, చిక్కీలు, కోడిగుడ్లు ఎన్ని వచ్చాయి అనే సమాచారం అప్‌లోడ్ చేయాలి. ఉదాహరణకు మధ్యాహ్న భోజనం విషయం తీసుకుంటే ప్రతిరోజూ ఎంత సరుకు వచ్చింది?. ఎంత వినియోగించారు?. అందుకు ఎంత బిల్లు అవుతుంది?. గుడ్లు ఎన్ని అందాయి అనే అంశాలను రికార్డుల్లో పొందుపరచాల్సి ఉంటుంది. అలాగే ప్రతి తరగతిలో ఎంతమంది పిల్లలు హాజరయ్యారు అనే వివరాలను స్టూడెంట్స్ అటెండన్స్ యాప్‌లో నమోదు చేయాలి. ఇవి కాకుండా దీక్ష యాప్‌లో పిల్లలకు పాఠాలు ఎలా బోధిస్తున్నారు, వారికి పరీక్షల్లో వచ్చిన మార్కుల వంటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. వీటిని భర్తీ చేసి అప్‌లోడ్ చేయడానికి చాలా సమయం పడుతుండడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ తీరుతో బడులు మూత పడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.



యాప్‌లో వివరాలు పొందు పరుస్తున్న టీచర్లు

పీ–4 విధానంతో మరింత అసహనం..

అట్టడుగున ఉన్న పేదల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పీ4 కార్యక్రమానికి ఉన్నత వర్గాల నుంచి విముఖత వ్యక్తం కావడంతో ఆ భారాన్ని ఉపాధ్యాయులపై బలవంతంగా రుద్దారు. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రవేశపెట్టిన ఈ విధానంలో ఆయా కుటుంబాలను దత్తత తీసుకోవాలంటూ ఉపాధ్యాయులపై ఒత్తిళ్లు తీవ్రమయ్యాయి. దీంతో ఉపాధ్యాయులు మరింత అసహనానికి లోనవుతున్నారు. ఎన్నికల సమయంలో ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా.. కొత్తగా పేద కుటుంబాలను దత్తతకు తీసుకోవాలని ఒత్తిడి చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఉపాధ్యాయ సంఘాలు పోరుబాటకు కార్యాచరణను సిద్ధం చేస్తున్నాయి. ఇప్పటికే పలు ఉపాధ్యాయ సంఘాలు వ్యక్తిగతంగా ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాయి.

మినహాయింపునివ్వాలి



యాప్‌ల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపునివ్వాలి. ఆర్పీలను, ఇతర సిబ్బందికి ఈ విధులు అప్పగించాలి. రోజులో అధిక సమయం యాప్‌లో వివరాలు నమోదు చేయడానికే సరిపోతోంది. దీంతో బోధన కరువై విద్యార్థులు చదువులకు దూరమవుతారు. ఈ విధానానికి ప్రభుత్వం స్వస్తి పలకాలి.

– బడా హరిప్రసాదరెడ్డి, ఏపీటీఎఫ్(1938) జిల్లా అధ్యక్షుడు

చదువులకు దూరమవుతున్నారు



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లో వివరాలను భర్తీ చేసి అప్‌లోడ్ చేయడానికి చాలా సమయం పడుతోంది. దీంతో బోధనపై దృష్టి పెట్టలేకపోతున్నాం. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలి. ప్రభుత్వ తీరుతో పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు.

– శ్రీచందన, బుచ్చయ్యగారిపల్లి, బుక్కపట్నం మండలం

ఉద్యోగుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యత

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



కారుణ్య నియామక పత్రాలను అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ (చిత్రంలో) సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య

అనంతపురం సిటీ: ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యతనిస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఉమ్మడి జిల్లాలోని జిల్లా పరిషత్, అనుబంధ విభాగాల్లో వివిధ హోదాల్లో పని చేస్తూ అకాల మరణం పొందిన ఉద్యోగులకు సంబంధించిన వారసులు 13 మందికి జూనియర్ అసిసెంట్లుగా నియామక ఉత్తర్వులను జిల్లా పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో బుధవారం ఆమె అందజేసి, మాట్లాడారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ అలవర్చుకోవాలని కోరారు. కేటాయించిన విధులకు సంబంధించి సీనియర్ల సలహాలు తీసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి శ్రీకాళహస్తిలోని కేంద్రంలో శిక్షణ అనంతరం విధుల్లో చేరాల్సి ఉంటుందని జెడ్పీ సీఈఓ శివశంకర్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, 'ఏ' సెక్షన్ ఏఓ షబ్బీర్ నియాజ్, సీనియర్ అసిస్టెంట్లు అరుణకుమారి, మాధవి, జూనియర్ అసిస్టెంట్ జోషి ప్రణీత్, టైపిస్ట్ సుభాష్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు నవోదయ విద్యార్థులు



క్రీడల్లో ప్రతిభ చాటిన నవోదయ విద్యార్థులతో బోధనాసిబ్బంది

లేపాక్షి: నవోదయ విద్యాలయ క్లస్టర్ స్థాయి క్రీడా పోటీల్లో లేపాక్షి నవోదయ విద్యార్థులు 20 మంది ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. క్రీడలు ముగించుకుని బుధవారం ఉదయం విద్యాలయానికి చేరుకున్న విద్యార్థులను ప్రిన్సిపాల్ నాగరాజు, సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జూలై 29 నుంచి 31వ తేదీ వరకు జరిగాయి నవోదయ విద్యాలయాల క్లస్టర్ స్థాయి పోటీలు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరిగాయన్నారు. కేరళలోని మల్లాపురం నవోదయలో జరిగిన జూడో అండర్–14 పోటీల్లో సింధూ, హర్షిక, లాస్య, అండర్–17లో యశస్విని, అండర్–19లో శ్రీవాణి ప్రతిభ చాటారన్నారు. వీరు భోపాల్‌లోని నవోదయ విద్యాలయలో జరిగే జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొంటారన్నారు. అలాగే ఏలూరులో జరిగిన క్రికెట్ పోటీలలో అండర్–14 విభాగంలో దర్శిత్‌సాయి, అండర్–17లో హేమలత, వినూత, భువనేశ్వరి, ఫణిప్రకాష్ ప్రతిభ కనబరిచి, హర్యానాలోని కురుక్షేత్రం నవోదయలో జరిగే జాతీయ స్థాయిలో పోటీల్లో క్లస్టర్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. తెలంగాణలోని కరీంనగర్ నవోదయలో జరిగిన ఖోఖో అండర్–19 పోటీలలో సింహాద్రి ప్రతిభ కనబరిచి ఒడిశాలోని కటక్ నవోదయలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడన్నారు. తెలంగాణలోని రంగారెడ్డి నవోదయలో జరిగిన బాల్‌గేమ్స్ భవ్యశ్రీ విజేతగా నిలిచి, గుజరాత్‌లోని రాజ్‌కోట్ నవోదయలో జరిగే జాతీయ స్థాయిలో పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తోందన్నారు. గుంటూరు నవోదయలో జరిగిన యోగా పోటీల్లో చరణ్‌సాయి, నిధిక్ ప్రతిభ కనబరిచారని, వీరు గుంటూరు నవోదయలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. విజయనగరం నవోదయలో జరిగిన బాల్‌గేమ్స్ క్రీడల్లో జయదీపికా ప్రతిభ కనబరిచి బిహార్‌లోని పాట్నా నవోదయలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. కేరళలోని కాసరఘడ్ నవోదయలో జరిగిన బాస్కెట్‌బాల్ క్రీడల్లో జుతేష్ ప్రతిభ కనబరిచి మధ్యప్రదేశ్‌లోని గుణ నవోదయ విద్యాలయలో జరిగే జాతీయ స్థాయిలో పోటీల్లో ప్రాతినిధ్యం వహించే క్లస్టర్ జట్టు తరపున పాల్గొనను న్నాడని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను క్రీడా ఉపాధ్యాయులు వివేకానంద, వేదవతి, షేక్ ఆసీఫ్‌అలీ, సిబ్బంది అభినందించారు.

'ఆత్మీయ' పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం అర్బన్: విద్యారంగంలో విశేష కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్తమ పురస్కారాలను అందజేయనున్నట్లు ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ధర్మవరంలోని ఎన్జీఓ హోమ్‌లో యూటీఎఫ్ జోనల్ స్థాయి నాయకులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య అన్ని పాఠశాలల్లో 15 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు అర్హులన్నారు. బోధనలో ప్రతిభతో పాటు విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తూ నైతిక విలువలతో ఎలాంటి క్రమశిక్షణ చర్యలకు లోనుకాని ఉపాధ్యాయులు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం నాడు పురస్కారాలను అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 90309 44717, 94417 34907లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రామకృష్ణ నాయక్, లక్ష్మయ్య, ఆంజనేయులు, హరికృష్ణ, రాంప్రసాద్, మేరీ వరకుమారి, నాగేంద్రమ్మ, సాయిగణేష్, రామకృష్ణ, నాగిరెడ్డి, రామాంజనేయులు, అమర నారాయణరెడ్డి, వెంకట కిషోర్, బి.ఆంజనేయులు, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు అపహరణ

పుట్టపర్తి టౌన్: మాయమాటలతో దుకాణదారును ఏమార్చి ఆమె మెడలోని బంగారు గొలుసును తెలివిగా అపహరించుకెళ్లిన ఘటన పుట్టపర్తిలో సంచలనం రేకెత్తించింది. బాధితురాలు తెలిపిన మేరకు... పుట్టపర్తిలోని ఎస్‌బీఐ రోడ్డులో నివాసముంటున్న కుసుమాంబ స్థానికంగా ఓ ఫ్యాన్సీ స్టోర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో ఇద్దరు యువకులు ఫ్యాన్సీ స్టోర్‌కు వచ్చారు. ఒకరు బయట స్కూటీ మీద కూర్చొని ఉండగా, మరొకరు స్టోర్‌లోకి వెళ్లి ఫెయిర్ అండ్ లవ్లీ కొనుగోలు చేశాడు. ఆదే సమయంలో కుసుమాంబతో మాటలు కలిపి వ్యాపారం ఎలా జరుగుతోందంటూ ఆరా తీశాడు. క్యాష్ బ్యాక్స్‌లో బంగారాన్ని పెడితే రెట్టింపు అవుతుందని, వ్యాపారం కూడా బాగా జరుగుతుందని నమ్మబలికాడు. అతని మాయ మాటల్లో చిక్కిన ఆమె తన మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు తీసి క్యాష్ బ్యాక్స్‌లో వేయబోతుండగా అలా కాదని తన వద్ద ఉన్న ఓ పేపర్ తీసి అందులో పెట్టమని అడిగాడు. ఆమె అలాగే పేపర్‌లో బంగారు గొలుసు పెట్టిన తర్వాత దానిని మడిచి ఆమె దృష్టి ఏమారుస్తూ క్యాష్ బ్యాక్స్‌లో వేసి, తన సహచరుడితో కలసి ద్విచక్ర వాహనంపై వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత ఆ పేపర్ తీసి చూడగా అందులో బంగారు గొలుసు కనిపించలేదు. తాను మోసపోయినట్లుగా తెలుసుకున్న ఆమె కన్నీటిపర్యతమవుతూ స్థానికులకు వివరించింది. సమాచారం అందుకున్న పుట్టపర్తి అర్బన్ పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనపై బాధితురాలితో ఆరా తీశారు. కేసు నమోదు చేసి సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.



ఘటనపై ఆరా తీస్తున్న పోలీసులు

జిల్లా క్రీడా జట్ల ఎంపిక

హిందూపురం టౌన్: నేషనల్ స్పోర్ట్స్ డేని పురస్కరించుకుని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం హిందూపురంలోని ఎంజీఎం క్రీడామైదానంలో వివిధ క్రీడా జట్ల ఎంపిక చేశారు. పోటీలను మున్సిపల్ డీఈ రమేష్‌కుమార్ ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాలలో 22 ఏళ్ల లోపు పురుషులు, మహిళల క్రీడా జట్లను ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 200 మంది పురుషులు, 150 మంది మహిళలు హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకూ తిరుపతిలో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. అక్కడ ప్రతిభ చాటిన వారిని విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ డీఈ రమేష్‌కుమార్

కార్యక్రమంలో డీఎస్‌డీఓ ఉదయ భాస్కర్, ఎంజీఎం ఉన్నత పాఠశాల హెచ్ఎం పాండురంగనాయకులు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ మొరార్జీ యాదవ్, పీడీ, పీఈటీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సురేష్ కుమార్, పీడీ లోక్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

'పురం'లో భూమి.. చిలమత్తూరులో రిజిస్ట్రేషన్!

- రూ.కోటి విలువైన భూమిని టీడీపీ నేత మంగేష్‌కు రిజిస్ట్రేషన్
- రాత్రి ఏడు గంటల సమయంలో తతంగం



జనాలతో రద్దీగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

చిలమత్తూరు: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం పోలీసు బందోబస్తు నడుమ రాజ్ సుధీర్ అనే వ్యక్తి హిందూపురంలోని తన భూమిని టీడీపీ నేత మంగేష్‌కు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. హిందూపురం రెవెన్యూ గ్రామానికి చెందిన భూమిని అక్కడ కాకుండా చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పోలీసు బందోబస్తు మధ్య చేయడం అనుమానాలకు తావిచ్చింది. కాగా.. అత్యంత భద్రంగా ఉండాల్సిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ డాక్యుమెంట్ గదిలో ప్రైవేటు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడం కలకలం రేపింది.

అసలు ఏం జరిగిందంటే..

రాజ్ సుధీర్ అనే వ్యక్తికి హిందూపురం రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ పక్కన భూమి ఉండేది. ఈ భూమిని 2004లో ప్లాట్లుగా వేసిన రాజ్ సుధీర్ పలువురికి విక్రయించాడు. అయితే వారెవరికీ రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. తాజాగా మంగేష్‌కు అదే భూమిలోని కొంత భాగాన్ని కోటి రూపాయలకు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేందుకు ఒప్పుకున్నాడు. అయితే హిందూపురంలో రిజిస్ట్రేషన్ పెట్టుకుంటే గతంలో భూములు కొన్నవారు వచ్చి అడ్డుకుంటారని భావించి చిలమత్తూరులో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. అయితే ఈ విషయం తెలుసుకున్న రాజ్ సుధీర్ బాధితులు... చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు చేరుకుని తమను మోసం చేసిన రాజ్ సుధీర్‌ను పట్టుకున్నారు. టీడీపీ నేత మంగేష్ వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా...వారంతా ఎదురు తిరిగారు. దీంతో మంగేష్ అక్కడి నుండి జారుకున్నారు. అనంతరం బాధితులు రాజ్ సుధీర్‌ను స్థానిక పీఎస్‌లో అప్పజెప్పారు.

ఎస్‌ఐ నరేంద్ర ఓవరాక్షన్..

లేపాక్షి ఎస్‌ఐ నరేంద్ర చిలమత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఓవర్ యాక్షన్ చేశారు. గొడవ గురించి ఆరా తీసేందుకు స్టేషన్‌లోకి వెళ్లగా... లోపలికి ఎవరు రమ్మన్నారంటూ విలేకరులపై దురుసుగా ప్రవర్తించారు. పోలీసులు సివిల్ వ్యవహారాల్లో తలదూర్చకూడదని చట్టం చెబుతుండగా... ఎస్‌ఐ నరేంద్ర మాత్రం.. ఇరువర్గాలను ఒప్పించి సెటిల్‌మెంట్ చేయాలని చూస్తున్నానని చెప్పడం గమనార్హం. అంతేకాకుండా ఎస్‌ఐ నరేంద్ర నిందితుల పక్షాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద బందోబస్తు నిర్వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



నిందితుడిని స్టేషన్‌కు తరలిస్తున్న బాధితులు

బంతికి డిమాండ్



పుట్టపర్తి వద్ద సాగు చేసిన బంతి పూల తోట

పెళ్లిళ్ల సీజన్‌తో పాటు విశిష్ట పండుగలు కలసి వచ్చిన ఈ శ్రావణ మాసంలో బంతి పూలకు భారీగా డిమాండ్ నెలకొంది. గతంలో కిలో బంతి పూలు కేవలం రూ.30 నుంచి రూ.40 వరకూ అమ్ముడు పోగా తాజాగా రూ.వందకు చేరుకుంది. త్వరలో వినాయక చవితి, దేవీ శరన్నవరాత్రులు, కార్తీక మాసం రానుండడంతో పూల ధరలు నిలకడగా ఉంటాయని రైతులు ఆశిస్తున్నారు. కాగా, జిల్లా వ్యాప్తంగా సుమారు 719 హెక్టార్లలో పూల తోటలు విస్తరించి ఉన్నాయి. ఇందులో 185 హెక్టార్లలో చామంతి, 30 హెక్టార్లలో రోజా, 35 హెక్టార్లలో జాస్మిన్, 200 హెక్టార్లలో బంతి, 153 హెక్టార్లలో కనకాంబరాలు, మరో 117 హెక్టార్లలో ఇతర రకాల పూల తోటల సాగును రైతులు చేపట్టారు. కదిరి, హిందూపురం, అనంతపురం, ధర్మవరం మార్కెట్లతో పాటు కర్ణాటకలోని బాగేపల్లి, చిక్కబళ్లాపూర్, బెంగళూరు మార్కెట్లకు పూల దిగుబడిని రైతులు తరలిస్తున్నారు.

– పుట్టపర్తి అర్బన్:



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉన్న పూలు